
# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ ఆకస్మిక తనిఖీలు

**రూ.1.18.700 లక్షల అనధికార నగదు స్వాధీనం**







**ఆదోని,జూలై18.అక్షర టైమ్స్:-** రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అక్రమ వసూళ్లు జరుగుతున్నాయన్న సమాచారంతో ఏసీబీ అధికారులు శనివారం సాయంత్రం ఆదోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కర్నూలు ఏసీబీ డీఎస్పీ సీతారామరావు, సీఐ కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్, సిబ్బందితో పాటు నలుగురు డాక్యుమెంట్ రైటర్లు, వారి నలుగురు అసిస్టెంట్లు, ఇద్దరు ప్రైవేట్ వ్యక్తులు ఉన్నట్లు గుర్తించారు. ప్రభుత్వ ఉద్యోగులు కాని వ్యక్తులు కార్యాలయంలో ఉండటంపై అధికారులు ఆరా తీశారు. కార్యాలయంలోని పలు గదులను తనిఖీ చేయగా రూ.1,18,700 నగదు లభించింది. ఈ నగదుకు సంబంధించి సరైన ఆధారాలు చూపలేదని ఏసీబీ అధికారులు తెలిపారు. నగదు మూలాలు, కార్యాలయంలో ఉన్న ప్రైవేట్ వ్యక్తుల పాత్రపై సమగ్ర విచారణ చేపడుతున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయంలో గుర్తింపు లేని ఇద్దరు ప్రైవేట్ వ్యక్తులు ఉండటం ఇప్పుడు ఆదోని నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. వారు ఎవరు? ఏ పనిమీద కార్యాలయంలో ఉన్నారు? అనే అంశాలపై ప్రజల్లో ఆసక్తి నెలకొంది. ఆకస్మిక తనిఖీ మాత్రమే నిర్వహించినందున ప్రస్తుతం కేసు నమోదు చేయలేదని, విచారణ పూర్తయ్యాక నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని డీఎస్పీ తెలిపారు. అవకతవకలు రుజువైతే శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే 1064 టోల్‌ఫ్రీ నంబర్‌కు లేదా 9440446178కు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.

www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
కర్నూలు, నంద్యాల జిల్లా
వైయస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లా

# గుంటూరులో జరిగే అండర్ -21 అంతర్ జిల్లాల హాకీ పోటీలకు నంద్యాలజిల్లా జట్టు సిద్ధం

**జాతీయ స్థాయిలో రాణించి నంద్యాల పేరును దశదిశలా చాటాలని క్రీడాకారులకు పిలుపు**

**క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయన్న చాణిక్య రాజు**




**నంద్యాల.జులై18.అక్షర టైమ్స్:-** నంద్యాల జిల్లా హాకీ క్రీడాకారులు మరో ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌కు సిద్ధమయ్యారు. గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్సిటీ లో ఈ నెల 19 నుండి 22వ తేదీ వరకు నిర్వహించనున్న అండర్ -21 ఇంటర్ డిస్ట్రిక్ హాకీ మెన్ ఛాంపియన్షిప్ పోటీలకు నంద్యాల జిల్లా నుండి వెంకట సాయి (గవర్నమెంట్ కాలేజ్ జూనియర్ నంద్యాల), అభినయ్ నీరజ్ (వెలాసిటీ జూనియర్ కాలేజ్, నంద్యాల), వంశీ (గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ నంద్యాల), అసద్ హుస్సేన్ (న్యూక్లియస్ జూనియర్ కాలేజ్ నంద్యాల), నిఖిల్ (గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ నంద్యాల), మిద్ద శిరీష్ కారుణ్య (నారాయణ జూనియర్ కాలేజీ, నంద్యాల), రాజశేఖర్ (ఎస్ పి జి హై స్కూల్ నంద్యాల), అనుభవ్ (గుడ్ షఫర్డ్ స్కూల్ నంద్యాల), రాజేశ్వర్ రెడ్డి (గుడ్ షెఫర్డ్ స్కూల్ నంద్యాల), పవన్ కుమార్ (గుడ్ షెఫర్డ్ స్కూల్ నంద్యాల), అమీర్ (గుడ్ షఫర్డ్ స్కూల్ నంద్యాల) క్రీడాకారులను నంద్యాల జిల్లా హాకీ అసోసియేషన్ ప్రతినిధులు, ఏపీ హాకీ అధ్యక్షుడు చాణిక్యరాజు ఆధ్వర్యంలో నేడు స్థానిక ఎస్పీజీ హై స్కూల్ గ్రౌండ్ నందు ఎంపిక చేశారు. ఈ పోటీలలో పాల్గొనే నంద్యాల జిల్లా జట్టుకు హాకీ నంద్యాల జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథి గా హాజరైన ఎస్ స్పీజీ హై స్కూల్ హెచ్. ఎం నళిని, ఏపీ హాకీ అధ్యక్షుడు చాణిక్యరాజు, జిల్లా జాయింట్ సెక్రెటరీ దివాకర్, ట్రెజరర్ స్టీఫెన్ జెర్సీలను బహుకరించారు. ఈ సందర్భంగా ఏపీ హాకీ అధ్యక్షుడు చాణిక్య రాజు మాట్లాడుతూ.. క్రీడలు కేవలం శారీరక దృఢత్వాన్ని మాత్రమే కాకుండా, మానసిక ఉల్లాసాన్ని, జీవితంలో క్రమశిక్షణను అలవరుస్తాయని పేర్కొన్నారు. ప్రస్తుతం క్రీడల్లో ప్రతిభ చాటిన వారికి ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. నంద్యాల జిల్లా హాకీ క్రీడాకారులు ఈ టోర్నీలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి, భవిష్యత్తులో జాతీయ స్థాయిలో రాణించి జిల్లా పేరును దశదిశలా చాటాలని ఆయన ఆకాంక్షించారు. ఎస్పీజీ హెచ్. ఎం నళిని మాట్లాడుతూ... జాతీయ క్రీడ అయిన హాకీని ఎంచుకోవడం అభినందనీయం అన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరచి నంద్యాల జిల్లా కు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో హాకీ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు మాణిక్యం రాజు, సెక్రెటరీ సునీల్ ముత్యం, జాయింట్ సెక్రెటరీ దివాకర్, ట్రెజరర్ స్టీఫెన్ మరియు టీం కోచ్ శ్రావణ్ కుమార్, ఎస్పీజీ వ్యాయామ ఉపాధ్యాయుడు వినీత్ , క్రీడాకారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే జగన్ 2.0 లక్ష్యం: మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి




**ఆదోని,జూలై18.అక్షర టైమ్స్:-** ఆదోని నియోజకవర్గం వైసీపీ పార్టీ కార్యాలయం లో మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన2.0 కార్యక్రమాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, “జగన్ 2.0 అనేది ప్రజలకు మరింత చేరువ కావడం వారి సమస్యలను తెలుసుకొని వారి పరిష్కారం కోసం పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో పనిచేసే కార్యచరణ వైఎస్ఆర్సిపి ఎల్లప్పుడూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతుంది. ప్రతి కార్యకర్త ప్రజలతో మమేకమై పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేయాలిని తెలిపారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజల విశ్వాసాన్ని మరింతగా పొందెందుకు జగన్2.0 దోహదపడుతుందని తెలిపారు. పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేసే వైఎస్ఆర్సిపి మరింతగా బలోపితం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు జగన్ 2.0 లక్ష్యాలు, కార్యచరణ పై కార్యకర్తలకు వివరించి, పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయి వరకు విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మధుసూదన్, వైఎస్ఆర్సిపి పార్టీ సీనియర్ నాయకులు చంద్రకాంత్ రెడ్డి వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీఈఓల ఉద్యోగాల క్రమబద్ధీకరణకు విజ్ఞప్తి

**ఐదు నెలల జీతాలు విడుదల చేయాలని వినతి**





**నంద్యాల,జూలై18.అక్షర టైమ్స్:-** వ్యవసాయ శాఖలో 12 నుంచి 15 ఏళ్లుగా మల్టీ పర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లు (ఎంపీఈఓలు)గా పనిచేస్తున్న తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని నంద్యాల జిల్లా ఎంపీఈఓలు ప్రభుత్వాన్ని కోరారు. ఐదు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొంటూ జిల్లా వ్యవసాయ అధికారికి శనివారం వినతిపత్రం అందజేశారు. 2014లో డీఎస్సీ ద్వారా నియమితులైన తమకు ప్రస్తుతం తక్కువ వేతనం మాత్రమే అందుతోందని, “సమాన పనికి సమాన వేతనం” సూత్రం ప్రకారం వేతనం చెల్లించాలని కోరారు. కాంట్రాక్ట్ ఉద్యోగాలను క్రమబద్ధీకరించి టైమ్ స్కేల్ అమలు చేయడంతో పాటు రైతు భరోసా కేంద్రాల్లో ఖాళీ పోస్టుల్లో అవకాశం కల్పించాలని, మహిళా ఉద్యోగులకు మెటర్నిటీ లీవ్ సహా ఇతర సెలవు సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ-క్రాప్ నమోదు, ఎరువుల పంపిణీ, పంటల బీమా, రైతుల నమోదు తదితర వ్యవసాయ కార్యక్రమాల్లో కీలకంగా పనిచేస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎంపీఈఓలు కోరారు.

# దళితులకు రెండు ఎకరాల స్మశాన భూమి ఇవ్వాలి

**తహసీల్దార్ శ్రీనివాసులకు వినతిపత్రం**




**నంద్యాల,జూలై18.అక్షర టైమ్స్:-** నంద్యాల పట్టణంలోని 19వ వార్డు పొన్నాపురం, పొన్నాపురం కాలనీలో నివసిస్తున్న దళితులకు జీవో నెం.1235 ప్రకారం రెండు ఎకరాల స్మశాన భూమి కేటాయించాలని కోరుతూ కెవిపిఎస్, సీఐటీయూ తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, 200కు పైగా దళిత కుటుంబాలు, సుమారు 7 వేల మంది ప్రజలకు కేవలం నాలుగు సెంట్ల స్మశాన స్థలం మాత్రమే ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దయనీయంగా మారుతోందని, వెంటనే రెండు ఎకరాల స్మశాన భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీనిపై తహసీల్దార్ శ్రీనివాసులు స్పందిస్తూ, ప్రస్తుతం ఉన్న స్మశాన స్థలానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి, సర్వే నిర్వహించిన అనంతరం అవసరమైతే దళితుల కోసం రెండు ఎకరాల భూమి కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శులు లక్ష్మణ్, వెంకటలింగం, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎంఆర్ నాయక్, ప్రజానాట్య మండలి నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# అభివృద్ధిని ఓర్చుకోలేక నాశనం చేసేందుకు కుట్రలు




**నందవరం,జూలై18.అక్షర టైమ్స్:-** అభివృద్ధిని నాశనం చేయడానికి ఎమ్మిగనూరు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి ఇటీవల కుట్రలు చేయడానికి ప్రయత్నించారని శనివారం నందవరం మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ మండల ఐటీడీపీ, తెలుగు యువత కమిటీ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ గతంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి ఇటీవల మా ఎమ్మెల్యే గౌరవనీయులు డాక్టర్ బి.వి జయనాగేశ్వర రెడ్డి పై అభివృద్ధిని నాశనం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. వారి దుర్మార్గాలు ఇక సాగవు అని అన్నారు. గొడ్డలితో సొంత చిన్నాన్నను నరికేసిన దుర్మార్గుడు జగన్ ప్రజల మధ్య విభేదాలు సృష్టించాలనుకోవడం అవివేకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నందవరం మండల ఐటీడీపీ, తెలుగు యువత అధ్యక్షులు ఎ,సురేంద్రరెడ్డి గడ్డం వెంకటేష్ తెలుగు యువత ఉపాధ్యక్షులు నీలకంఠ, యువ నాయకులు సందీప్, షాలీం, ఉషేన్ బాబు, కురువ మునిస్వామి, దుల్లయ్య, నాగరాజు, నభిరసూల్, తదితరులు పాల్గొనడం జరిగింది.

# మాజీ ఎమెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి కార్యాలయంలో “జగన్ 2.0 సూపర్ యాప్” పోస్టర్ ఆవిష్కరణ : ఎమ్మెల్సీ ఇసాక్ బాషా



**నంద్యాల,జులై18.అక్షర టైమ్స్:-** ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాక్ బాషా మాట్లాడుతూ., కార్యకర్తలకు అండగా జగనన్న పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి , అలాగే పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. కార్యకర్తలపై జరుగుతున్న అక్రమ కేసులు, వేధింపులను చట్టపరంగా, ధైర్యంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.జగన్ 2.0 సూపర్ యాప్,ద్వారా క్షేత్రస్థాయి కార్యకర్తలను నేరుగా అధిష్టానంతో అనుసంధానం చేయడం ఒక గొప్ప పరిణామమని కొనియాడారు.సోషల్ మీడియా వేదికగా వైఎస్ఆర్సిపి పై, జగనన్న పై జరుగుతున్న దుష్ప్రచారాన్ని, తప్పుడు వార్తలను ఈ యాప్ ద్వారా క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ సమన్వయంతో పనిచేస్తూ, ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేయాలని, రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆయన సూచించారు. ఇప్పుడే జగన్ 2.0 అప్లికేషన్ ని డౌన్లోడ్ చేసుకోండి.

# స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్రలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పారిశుద్ధ్య కార్యక్రమం

**పరిశుభ్రతపై అవగాహన.. పట్టణంలో విద్యార్థుల ర్యాలీ: ప్రిన్సిపాల్. డా” కె.ఉషశ్రీ**




**వేంపల్లె,జూలై18.అక్షర టైమ్స్:-** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక పట్టణంలోని వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. ఉషశ్రీ అధ్యక్షతన అధ్యాపకులు, విద్యార్థులు కళాశాల ప్రాంగణాన్ని శుభ్రపరిచి పరిశుభ్రత ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించాలని, పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఉషశ్రీ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి వారానికి కనీసం ఒక గంట సమయాన్ని పరిశుభ్రత కార్యక్రమాలకు కేటాయించాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు పట్టణ పురవీధుల్లో పరిశుభ్రతపై నినాదాలు చేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, అధ్యాపకులు డా. సతీష్, డా. హరిత, డా. హాజియ బేగం, రాజారెడ్డి, పీడీ తేజేంద్ర, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి సీనియర్ చెస్ పోటీలు ప్రారంభం

**26 జిల్లాల నుంచి 264 మంది క్రీడాకారులు**






**నంద్యాల,జూలై18.అక్షర టైమ్స్:-** అంతర్జాతీయ చెస్ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ చెస్ సంఘం ఆధ్వర్యంలో, నంద్యాల జిల్లా చెస్ సంఘం నిర్వహణలో రాష్ట్రస్థాయి సీనియర్ ఓపెన్ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలు శనివారం నంద్యాల రామకృష్ణ పీజీ కళాశాల ఆడిటోరియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి పోటీలను ప్రారంభించి మాట్లాడుతూ, విద్యార్థుల సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని, చదరంగం ఏకాగ్రతను పెంపొందిస్తుందని అన్నారు. జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ, చదరంగం విద్యార్థుల్లో మేధోశక్తి, విశ్లేషణాత్మక ఆలోచనను పెంపొందిస్తుందని తెలిపారు. శాంతినికేతన్ విద్యాసంస్థల చైర్మన్ సుధాకర్, రామకృష్ణ విద్యాసంస్థల డైరెక్టర్ హేమంత్ రెడ్డి క్రీడాకారులను అభినందించి విజేతలు జాతీయ స్థాయిలో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఎటోర్నమెంట్ నిర్వాహకులు రామసుబ్బారెడ్డి, చీఫ్ ఆర్బిటర్ వెంకటకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి 264 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని, వారిలో 124 మంది ఫీడే రేటింగ్ కలిగిన ఆటగాళ్లు ఉన్నారని తెలిపారు. ఆదివారం జరిగే ముగింపు కార్యక్రమంలో విజేతలకు పతకాలు, ట్రోఫీలు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఎకార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చెస్ సంఘం ప్రతినిధులు, జిల్లా చెస్ సంఘం సభ్యులు, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# శ్రీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థాన వివిధ హక్కులకు బహిరంగ వేలం

**షాపు,తాత్కాలిక స్టాల్,భూమి కౌలు హక్కులు అత్యధిక బిడ్లకు దక్కింపు**

**దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె.సుభాష్**



**వేంపల్లె,జూలై18.అక్షర టైమ్స్:-** శ్రీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించిన వివిధ హక్కుల బహిరంగ వేలం శనివారం ఉదయం స్థానిక పట్టణంలోని ఆ దేవస్థానం కార్యాలయం వద్ద నిర్వహించినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె. సుభాష్ తెలిపారు. దేవస్థానం షాపింగ్ కాంప్లెక్స్‌లోని 19వ షాపును వేంపల్లికి చెందిన మడక రమేష్ నెలవారీ అద్దె రూ.30 వేల చొప్పున అత్యధిక బిడ్‌కు దక్కించుకున్నట్లు తెలిపారు. అలాగే, దేవస్థానంలో తాత్కాలిక స్టాల్ ఏర్పాటు చేసి పూజా సామగ్రి విక్రయించే హక్కును చక్రాయపేట మండలం, కొండవాండ్లపల్లి గ్రామానికి చెందిన కె. విజయ్ కుమార్ ఏడాది కాలానికి రూ.30,500 అత్యధిక బిడ్‌కు పొందినట్లు పేర్కొన్నారు. దేవస్థానానికి చెందిన అలిరెడ్డిపల్లి గ్రామంలోని 23 సెంట్ల భూమి వార్షిక కౌలు హక్కు రూ.3,200కు వేలంలో దక్కినట్లు వెల్లడించారు. బహిరంగ వేలాన్ని జిల్లా దేవాదాయ శాఖ అధికారి కార్యాలయం సూపరింటెండెంట్ జి. రమణమ్మ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పీవీ. రమణ, పాలకమండలి సభ్యులు సునీల్ కుమార్, రామయ్య, జ్యోతి, రాజమ్మ, రమణమ్మతో పాటు పలువురు పాల్గొన్నారు.


# లింగ నిర్ధారణ చట్ట రీత్యా నేరము

**బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్**




**బద్వేల్,జులై18.అక్షర టైమ్స్:-** లింగ నిర్ధారణ చట్ట రీత్యా నేరముఅని బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్ తెలియజేశారు.శనివారం బద్వేల్ రెవిన్యూ డివిజన్ కార్యాలయం నందు రెవెన్యూ డివిజనల్ అధికారి చంద్ర మోహన్, సబ్ డివిజనల్ పోలీస్ అధికారి జి. రాజేంద్ర ప్రసాద్ ఆదేశాల మేరకు సబ్ డిస్ట్రిక్ మల్టీ మెంబర్స్ అథార్టీ కమిటీ సమావేశం ఉప జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో ఆర్డీవో చంద్రమోహన్ మాట్లాడుతూ ప్రైవేటు, గవర్నమెంట్ హాస్పిటల్ స్కాన్ సెంటర్ నందు లింగ నిర్ధారణ చేయరాదన్నారు.అటు లింగ నిర్ధారణ జరిపిన యడల కఠిన చర్యలు తీసుకోబడునన్నారు.ప్రైవేట్, గవర్నమెంట్ హాస్పిటల్ నందు స్కానింగ్ తీసుకునే సమయంలో ఆడ మగ అని లింగ నిర్ధారణ చేపట్టిన వారికి కఠినంగా శిక్షించవలనని వైద్యాధికారులకు ఆదేశాలు ఇచ్చారు.ఉప జిల్లా వైద్య ఆరోగ్య శాఖ డాక్టర్ బి.మల్లేష్ మాట్లాడుతూ మగ,ఆడ అని స్కానింగ్ సెంటర్లో తెలియజేస్తుంటే అటువంటి ఆస్పత్రులు మూసివేయబడునని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.రాజేష్ కుమార్,డాక్టర్ వై. శ్రీనివాసులు,డాక్టర్ శరత్చంద్ర, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి. వెంగయ్య,హెల్త్ సూపర్వైజర్స్ శివరాం రెడ్డి ,వి.జనార్దన్ రావు, శ్రీ రామయ్య, ఆశా కార్యకర్తలు స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నారు.

# దివ్యాంగుల”డిఈఎఫ్ ఆవిర్భావ దినోత్సవం” సభను జయప్రదం చేయండి



**ఆదోని,జూలై18.అక్షర టైమ్స్:** ఆదోని పట్టణంలోని రెడ్డి జన సంఘం కమ్యూనిటీ హాల్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర “దివ్యాంగుల సాధికారత ఫోరం” (డిఈఎఫ్) ఉపాధ్యక్షులు కమతం వెంకటేష్ మాట్లాడుతూ దివ్యాంగుల సామాజిక సంక్షేమాభివృద్ధే ధ్యేయంగా వారి హక్కుల, రాయితీ, రిజర్వేషన్లు సాధికారతకై ఆత్మగౌరవ గళ్ళాన్నీ వినిపించేందుకు ఈ నెల 22వ తేదీ బుధవారం ఆదోని పట్టణంలోని “రెడ్డి జన సంఘం కమ్యూనిటీ హాల్” లో దివ్యాంగుల “డిఈఎఫ్ ఆవిర్భావ దినోత్సవం” సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ప్రజాక్షేత్రంలోని పాలక ప్రజాప్రతినిధులు, వివిధ సామాజిక వర్గాలకు చెందిన పలువురు నాయకులు అలాగే వివిధ దివ్యాంగ సామాజిక సంక్షేమ సంఘాల ముఖ్య నాయకులు హజరు అవుతారని ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉన్న దివ్యాంగ సోదర, సోదరీమణులందరూ ఈ సభను జయప్రదం చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర డిఈఎఫ్ అధ్యక్షులు బి సి నాగరాజు, జిల్లా విభాగం నాయకులు ఇస్మాయిల్, ఎర్రిస్వామి, సోమప్ప, రంజాన్, రామదాసు, వెంకటేష్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

# వరుణ్ హైస్కూల్‌లో ఎస్‌పీఎల్ ఎన్నికలు నిర్వహణ

**విద్యార్థులకు ప్రజాస్వామ్య విధానం పై అవగాహన కల్పించటం**

**ఎన్నికల ప్రక్రియ, ఓటు విలువపై పిల్లలకు ద**

**అవగాహన కల్పించడమే ఈ ఎన్నికల ప్రధాన ఉద్దేశం**





**బ్రహ్మంగారిమఠం,జూలై18.అక్షర టైమ్స్:-** బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని వరుణ్ హైస్కూల్‌లో విద్యార్థి నాయకత్వాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో స్కూల్ పీపుల్ లీడర్ (ఎస్‌పీఎల్) ఎన్నికలను శనివారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో పాఠశాలలో చదువుతున్న పలువురు విద్యార్థులు, విద్యార్థినులు ఎస్‌పీఎల్ పదవికి పోటీ చేశారు.ఉదయం నుంచే విద్యార్థులు క్రమశిక్షణతో వరుసలో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకొని తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేశారు. ఎన్నికల ఫలితాలను సోమవారం ప్రకటించనున్నట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. పాఠశాల కరస్పాండెంట్ ఈ.వి. రమణారెడ్డి ఆదేశాల మేరకు ప్రధానోపాధ్యాయుడు ప్రణయ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ, విద్యార్థులకు ప్రజాస్వామ్య విధానం, ఎన్నికల ప్రక్రియ, ఓటు విలువపై అవగాహన కల్పించడమే ఈ ఎన్నికల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన పౌరస్ఫూర్తిని పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు.

# బద్వేలు లో ఆధునిక వ్యర్థాల నిర్వహణ కేంద్రం ప్రారంభం

**వర్చువల్ విధానంలో ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**





**బద్వేల్,జులై18.అక్షర టైమ్స్:-** బద్వేల్ పురపాలక సంఘం పరిధిలో ఘన వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణను మరింత బలోపేతం చేసే దిశగా రూ.3.32 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆధునిక మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ (యం.ఆర్.యఫ్) చెత్త ప్రాసెసింగ్ యూనిట్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో ప్రారంభించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ఘన వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ప్రతి పట్టణాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు ఆధునిక వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.బద్వేల్‌లో ఏర్పాటు చేసిన ఈ ఆధునిక ఎంఆర్ఎఫ్ యూనిట్ ద్వారా తడి చెత్త, పొడి చెత్తను శాస్త్రీయ పద్ధతిలో వేరు చేసి, తడి చెత్తతో సేంద్రియ ఎరువులు తయారు చేయడంతో పాటు, పొడి చెత్తను పునర్వినియోగం (రిసైక్లింగ్) కోసం ప్రాసెస్ చేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియ ద్వారా పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రమైన పట్టణం, వ్యర్థాల సమర్థ నిర్వహణ లక్ష్యాలు సాధ్యమవుతాయన్నారు.బద్వేల్‌లో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, నాయకులు మాట్లాడుతూ బద్వేల్ పట్టణాన్ని పరిశుభ్రంగా, పర్యావరణ హితంగా తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ ఇంటి వద్దే తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో నాగభూషణం డిగ్రీ కాలేజ్ యన్.సీ.సీ, యన్.యస్.యస్ విద్యార్థులు ఉన్నతాధికారులకు ప్రముఖులకు స్వాగతం పలుకుతూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.ఈ కార్యక్రమం లో ప్రారంభోత్సవంలో టీడీపీ బద్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, డీసీసీ బ్యాంకు చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి, ఆర్డీవో చంద్రమోహన్, మున్సిపల్ కమిషనర్ ఎం. కృష్ణ మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# సూర్యనారాయణ రెడ్డి ని కలిసిన కొండూరు గ్రామ టీడీపీ నాయకులు



**బద్వేల్,జులై18.అక్షర టైమ్స్:-** బద్వేల్ నియోజకవర్గం అట్లూరు మండలం కొండూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు శనివారం నూతన బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం తమపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా మంచూరు సూర్యనారాయణ రెడ్డి బద్వేల్ నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఆయన నాయకత్వంలో గ్రామ స్థాయి నుంచి పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తూ, ప్రతి కార్యకర్తను సమన్వయం చేసుకుని పార్టీ విజయానికి కృషి చేస్తామని తెలిపారు.అనంతరం మంచూరు సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, తనను కలిసి అభినందన...

# తెలంగాణ మన్ను మనకిచ్చిన దన్ను!



బతుకమ్మ పండుగంటే రోజూ ఆటలూ పాటలూ ఉంటాయి. నలుగురూ ఒక్కచోట కలవడం, ఆనందంగా ముచ్చట్లాడటమూ కనిపిస్తుంది. ఇలా గుంపులుగా నృత్యం, గానం చేయడం అన్నది శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే విషయమనీ నిపుణులు చెబుతున్నారు. మరి తెలంగాణ మన్ను మనకిచ్చిన దన్ను ఏమిటో తెలుసుకుందాం. క్రమబద్ధంగా వంగుతూ, నిలబడుతూ బతుకమ్మ ఆడుతారు. దీనివల్ల నడుముకు కావాల్సిన వ్యాయామం లభిస్తుంది. వెన్నెముక, నడుము సమస్యలు దూరం అవుతాయి. చప్పట్లు కొట్టడం వల్ల అర చేతులలోని నరాల చివరలు ఉత్తేజితం అవుతాయి. ఫలితంగా, చేతులు, కండరాలకు రక్త ప్రసరణ సవ్యంగా సాగుతుంది. రక్తపోటు తగ్గి.. గుండె జబ్బులు రాకుండా ఉంటుంది. ఆడటం వల్ల శరీరంలోని వివిధ కండరాల్లో కదలికలు ఏర్పడతాయి. దాంతో అవి దృఢంగా తయారవుతాయి. అంతేకాదు, ఎముకలు కూడా గట్టి పడతాయి. ఆస్టియోపోరోసిస్‌లాంటి వ్యాధులూ రాకుండా ఉంటాయి. జానపదం, శాస్త్రీయం లేదా వెస్టర్న్ ఇందులో ఏ రకమైన నృత్యం చేయడమైనా సరే మన శరీర సమతుల్యతకు సహకరిస్తుంది. చక్కగా నిలబడేందుకు ఉపయోగపడే బ్యాలెన్సింగ్ వ్యవస్థ మెరుగుపడుతుంది. పాడటం లేదా ఆడటం%౯% ఈ రెండింటిలోనూ మనం దమ్మును పట్టి ఉంచాల్సి వస్తుంది. తద్వారా ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుంది. నలుగురితో కలిసి పాడటం, ఆడటం అన్నది మనసును ఉత్తేజితం చేసే ప్రక్రియ. అందుకే ఈ సమయంలో హ్యాపీ హార్మోన్లుగా పిలిచే డోపమైన్, ఎండార్ఫిన్లు విడుదల అవుతాయి.

# భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం విక్రమ్-1 విజయగాథ





భారత అంతరిక్ష చరిత్రలో మరో స్వర్ణాక్షర ఘట్టం ఆవిష్కృతమైంది. ఇప్పటి వరకు ప్రభుత్వ రంగ సంస్థ ఇస్రో ఆధ్వర్యంలోనే అంతరిక్ష విజయాలు నమోదవుతుండగా, తొలిసారిగా ఒక భారతీయ ప్రైవేట్ అంతరిక్ష సంస్థ అదే ఆత్మవిశ్వాసంతో అంతరిక్షంలో తన ముద్ర వేసింది. హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ రూపొందించిన 'విక్రమ్-1' రాకెట్ శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లి భారత అంతరిక్ష రంగంలో కొత్త శకానికి నాంది పలికింది.ఈ ప్రయోగం కేవలం ఒక రాకెట్ ప్రయోగం మాత్రమే కాదు; ప్రభుత్వ--ప్రైవేట్ భాగస్వామ్యంతో భారతదేశం అంతరిక్ష వాణిజ్యంలో ప్రపంచస్థాయి పోటీదారుగా ఎదుగుతున్నదనే విషయాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన చారిత్రక ఘట్టం.

**ప్రైవేట్ అంతరిక్ష యుగానికి శ్రీకారం**

దశాబ్దాలుగా భారత అంతరిక్ష రంగం అంటే ఇస్రో అనే పేరే గుర్తుకొచ్చేది. కానీ నేడు ఆ రంగంలో ప్రైవేట్ సంస్థలు కూడా సత్తా చాటుతున్నాయి. సుమారు 350 కిలోల బరువున్న ఉపగ్రహాలను లో-ఎర్త్ ఆర్బిట్‌లోకి తక్కువ ఖర్చుతో, వేగంగా ప్రవేశపెట్టగల సామర్థ్యంతో రూపొందిన విక్రమ్-1 భారత అంతరిక్ష వాణిజ్యానికి కొత్త దిశను నిర్దేశించింది.ప్రపంచవ్యాప్తంగా చిన్న ఉపగ్రహాల ప్రయోగాలకు డిమాండ్ వేగంగా పెరుగుతున్న తరుణంలో, ఈ విజయం భారతదేశాన్ని విశ్వసనీయమైన అంతరిక్ష ప్రయోగ కేంద్రంగా నిలబెట్టే అవకాశాలను మరింత బలోపేతం చేసింది.

**విజయానికి వెనుకనున్న విజ్ఞానశక్తి**

ఈ విజయగాథ వెనుక ఇస్రో శాస్త్రవేత్తల అనుభవం, యువ శాస్త్రవేత్తల సృజనాత్మకత, ప్రభుత్వ సహకారం సమ్మిళితమై ఉన్నాయి.ఇస్రో మాజీ శాస్త్రవేత్తలు పవన్ కుమార్ చందన, నాగ భరత్ డాకా నాయకత్వంలో స్కైరూట్ శాస్త్రవేత్తల బృందం విక్రమ్-1ను రూపకల్పన చేసింది. మరోవైపు ఇస్రో తన సాంకేతిక పరిజ్ఞానం, పరీక్షా వసతులు, మార్గదర్శకత్వాన్ని అందించి ఈ ప్రయోగ విజయానికి బలమైన పునాది వేసింది.ఇన్-స్పేస్ వంటి సంస్థల ద్వారా ప్రైవేట్ స్టార్టప్‌లకు అవకాశాలు కల్పించడం, అంతరిక్ష రంగంలో భాగస్వామ్య విధానాన్ని ప్రోత్సహించడం భారత అంతరిక్ష విధానంలో వచ్చిన కీలక మార్పుకు నిదర్శనం.

**దేశవ్యాప్తంగా ప్రశంసల వెల్లువ**

విక్రమ్-1 విజయవంతంగా కక్ష్యలోకి చేరిన వెంటనే దేశవ్యాప్తంగా అభినందనల వెల్లువ ఎగసిపడింది.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ విజయాన్ని "భారత అంతరిక్ష రంగంలో చారిత్రక మైలురాయి"గా అభివర్ణిస్తూ, యువ శాస్త్రవేత్తల ప్రతిభకు ఇది నిదర్శనమని కొనియాడారు. 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్య సాధనలో ఈ విజయం కీలక అడుగని పేర్కొన్నారు.తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు కూడా హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న స్కైరూట్ సంస్థ ఈ ఘనత సాధించడం ప్రతి తెలుగు వ్యక్తికి గర్వకారణమని పేర్కొంటూ శాస్త్రవేత్తలను అభినందించారు.ఇస్రో మాజీ చైర్మన్లు, సీనియర్ శాస్త్రవేత్తలు సైతం కార్బన్ ఫైబర్ నిర్మాణం, ఆధునిక ఘన ఇంధన సాంకేతికత వంటి అంశాలు భారత రాకెట్ సాంకేతికతను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాయని ప్రశంసించారు.

**భవిష్యత్తుకు బలమైన పునాది**

విక్రమ్-1 విజయం భారత అంతరిక్ష ప్రయాణంలో ఒక గమ్యం కాదు; అది మరింత గొప్ప భవిష్యత్తుకు ఆరంభం. చిన్న ఉపగ్రహాల ప్రయోగాలకు ప్రపంచ కేంద్రంగా భారత్ అవతరించే దిశగా ఇది కీలకమైన అడుగు.ప్రభుత్వ విధానాలు, ప్రైవేట్ రంగ ఆవిష్కరణలు, యువ శాస్త్రవేత్తల ప్రతిభ కలిసివస్తే భారతదేశం అంతరిక్ష రంగంలో ప్రపంచ నాయకత్వాన్ని అందుకోవడం అసాధ్యం కాదని ఈ విజయం స్పష్టంగా నిరూపించింది.అంతరిక్షాన్ని కేవలం పరిశోధనల వేదికగా కాకుండా ఆర్థికాభివృద్ధి, సాంకేతిక స్వావలంబన, జాతీయ గౌరవానికి ప్రతీకగా మలుస్తున్న భారతదేశానికి విక్రమ్-1 ఒక నూతన దిక్సూచి. ఈ చారిత్రక విజయాన్ని భారత విజ్ఞాన సామర్థ్యానికి, యువత ఆవిష్కరణ శక్తికి ప్రతీకగా భావించాలి. బొల్లు రామమోహన్ రచయిత పోరుమామిళ్ల,వైఎస్సార్ కడప

# డివైఎఫ్ఐ జిల్లా మహాసభల ఆవిష్కరణ



**బద్వేల్,జులై18.అక్షర టైమ్స్:-** ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ కడప జిల్లా 8వ మహాసభలో ఆగస్టు నెల 10 11 వ తేదీలలో జమ్మలమడుగు పట్టణంలో జరిగే మహాసభలను జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ అట్లూరు మండల కమిటీ ఆధ్వర్యంలో డివైఎఫ్ఐ జిల్లా మహాసభల లోగో ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని హాజరై మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా జమ్మలమడుగు వేదిక గా ఆగస్టు 10,11 వ తేదీలలో రెండు రోజులపాటు ఈ మహాసభలు నిర్వహించడం జరుగుతుందన్నారు ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకత్వం హాజరవుతారని జిల్లాలో ఉన్నటువంటి డివైఎఫ్ఐ నాయకత్వం ప్రతినిధులు హాజరవుతారని ఈ మహాసభలలో నిరుద్యోగ సమస్య అజెండాగా మహాసభలలో చర్చించడం జరుగుతుందన్నారు అలాగే ఈ జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు కోసం ఉక్కు పరిశ్రమ కోసం గండికోట ప్రాజెక్టు సోమశిల ప్రాజెక్టు తెలుగు ప్రాజెక్టు గ్రామాలలో ఉన్న నిరుద్యోగ యువతీ యువకుల ఉద్యోగాల కోసం పోరాటాలు కొనసాగించమని అలాగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్నటువంటి విధానాలకు వ్యతిరేకంగా నిరుద్యోగ ఇచ్చినటువంటి హామీలు అమలు కోసం డివైఎఫ్ఐ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తుందని తెలిపారు. ఈ జిల్లా అభివృద్ధి కోసం ఈ జిల్లాలో నిరుద్యోగ సమస్య నిరంతరం పోరాడుతున్నటువంటి ఏకైక యుజన సంఘం డివైఎఫ్ఐ అని తెలిపారు. కాబట్టి ఈ మహాసభలలో జిల్లాలో ఉన్నటువంటి ప్రతినిధులు అందరూ హాజరై జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ అట్లూరు మండల అధ్యక్ష కార్యదర్శులు గోపాలయ్య, భాస్కర్, మండల నాయకులు విజిత్,భాను తేజ,సుబ్బరామయ్య, అజయ్,బాలకృష్ణ,మల్లికార్జున,చిన్నయ్య, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ కు ఘన స్వాగతం



**బద్వేల్,జులై18.అక్షర టైమ్స్:-** కడప జిల్లా పర్యటనలో భాగంగా స్వచంద్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ బద్వేలుకు విచ్చేశారు. ఈ సందర్భంగా బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి తమ నివాసంలో ఏర్పాటు చేసిన తేనీటి విందు కార్యక్రమానికి పట్టాభిరామ్ ను ఆహ్వానించి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం పార్టీ బలోపేతం, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ సంస్థాగత బలోపేతంపై నాయకులు చర్చించారు. పార్టీ కార్యకర్తలు ప్రజలకు మరింత చేరువై ప్రభుత్వ కార్యక్రమాలను విస్తృతంగా తీసుకెళ్లాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని కొమ్మారెడ్డి పట్టాభిరామ్ కి ఘన స్వాగతం పలికారు.

# ప్రతి పౌరుడు పరిశుభ్రతను తన బాధ్యతగా భావించాలి


**మున్సిపల్ కమిషనర్ ఎం. కృష్ణ**





బద్వేల్,జులై18.అక్షర టైమ్స్:- ప్రతి పౌరుడు పరిశుభ్రతను తన బాధ్యతగా భావించాలని బద్వేల్ మున్సిపల్ కమిషనర్ ఎం. కృష్ణ పిలిపునిచ్చారు.బద్వేల్ పురపాలక సంఘం పరిధిలో శనివారం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని పురపాలక సంఘం కమీషనర్ ఎం. కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా బద్వేల్ వెజిటబుల్ మార్కెట్ ప్రాంగణంలో ప్రత్యేక పారిశుద్ధ్య (క్లీనింగ్) కార్యక్రమం చేపట్టి మార్కెట్ పరిసరాలను పూర్తిగా శుభ్రపరిచారు. వెజిటబుల్ మార్కెట్‌లో వ్యాపారులు, వినియోగదారులు పరిశుభ్రత పాటించాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన చెత్త బుట్టల్లో మాత్రమే వేయాలని అవగాహన కల్పించారు. పట్టణ పరిశుభ్రత, పారిశుద్ధ్యం పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ప్రధాన రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా ప్రదేశాల్లో కూడా ప్రత్యేక శుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు.అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడినట్లు కమీషనర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో పురపాలక సంఘానికి చెందిన అన్ని శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది, మేప్మా సిబ్బంది, వార్డు సచివాలయ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# సాహితీ శిఖరం, మేరునగధీరం



తెలంగాణ మట్టిలో ప్రభవించిన అమూల్య రత్నం ఎస్వీ రామారావు. తన కలంతో, గళంతో గర్జించి తన అస్తిత్వాన్ని సాహిత్య లోకానికి చాటారు. సంస్థానాల ఖిల్లా అయిన పాలమూరు జిల్లాలోని శ్రీరంగాపురంలో జన్మించిన ఆయన వనపర్తి, హైదరాబాద్‌లలో విద్య నభ్యసించారు. ఉస్మానియా వర్సిటీలో ఆచార్యులుగా, శాఖాధిపతిగా, పాఠ్యప్రణాళికా విభాగపు అధ్యక్షులుగా, ఉత్తమ అధ్యాపకులుగా, పరిశోధకులుగా, విశిష్ట విమర్శకులుగా, తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవలు చేశారు. అంతేకాదు, విమర్శనా విన్యాసంతో తన విశ్వరూపాన్ని ప్రదర్శించిన ప్రతిభా పరుసవేది ఆయన.నడిగడ్డ పులిబిడ్డ అయిన సురవరం ప్రతాపరెడ్డి స్ఫూర్తితో తెలంగాణ కవితాశక్తిని ప్రపంచానికి చాటిచెప్పిన అపరచాణక్యుడు రామారావు. గడియారం రామకృష్ణ శర్మ గాంభీర్యాన్ని, విద్వత్ గద్వాల కవుల వైదుష్యాన్ని కూలంకషంగా గర్భీకరించుకున్న సుప్త చైతన్య విమర్శనా సూర్యుడై తెలుగు నేలను పులకింపజేశారు. ఆకారంలో వామనుడైనా విద్వత్తులో త్రివిక్రమార్కుడిగా విజృంభించి తెలంగాణ సాహిత్య శక్తిని బలంగా, సోదాహరణంగా ఆధారాలతో నిరూపించిన పరిశోధనా పారంగతుడు. సాహిత్య విద్యార్థులు సాధారణంగా కవిత్వం వైపు పరుగులు తీస్తుంటే రామారావు మాత్రం విమర్శ వైపు తన దృష్టిని సారించడం ఆయన వ్యక్తిత్వ వైవిధ్యానికి ప్రబల నిదర్శనం. తెలుగు సాహిత్యాభిమానంతో నిరంతరం సాహిత్య అధ్యయనం చేస్తూ పదిహేనేండ్ల వయస్సు నుంచే రామారావు తన రచనా ప్రస్థానాన్ని మొదలుపెట్టారు. విరివిగా వ్యాసాలు రాస్తూనే, సినిమా విమర్శకులుగా తెలుగు, హిందీ సినిమాలకు చక్కటి సమీక్షలనందించారు. 'అన్వీక్షణం', 'సమవీక్షణం', 'అభివీక్షణం' పేరిట మూడు విశిష్ట వ్యాస సంపుటాలను తెలుగు సాహితీ లోకానికి అందించారు. ఈ వ్యాసాలన్నీ వివిధ సందర్భాలలో సాహిత్యానికి సంబంధించిన విభిన్న అంశాలపై అతనికి గల ప్రతిభా పాటవాలకు అద్దం పడుతున్నాయి. పక్షపాత బుద్ధితో, స్వార్థ చింతనతో తెలంగాణ కవులను కవిత్వాన్ని నిరాదరణకు గురిచేసిన సాహిత్య పరిశోధకుల ప్రాంతీయ వివక్ష వల్ల సిసలైన తెలంగాణ కవితా వైభవ ప్రభావాలు మరుగునపడ్డాయి. అలా మరుగునపడిన మాణిక్యాలను వెలికితీసిన విద్వాంసుడు ఎస్వీ. స్వాభిమానంతో, నిష్పక్షపాత బుద్ధితో తెలంగాణ సాహిత్య విద్వత్తును దేశానికి నిర్మొహమాటంగా ఎలుగెత్తి చాటి తెలంగాణ కవితా కోహినూరు వజ్రాలను పదునుపెట్టి పట్టాభిషేకం చేయించిన ప్రతిభావంతుడు. విశ్వవిద్యాలయంలో విద్యాబోధన సాగిస్తూ, పరిశోధకులకు మార్గదర్శనం చేస్తూనే కవులకు జరుగుతున్న అన్యాయానికి అంతర్మథనం చెంది తర్కబద్ధమైన నిశిత పరిశీలనా దృష్టితో తెలంగాణ సాహిత్య శక్తిని నిర్దిష్టమైన ఆధారాలతో సాహిత్య చరిత్రకు అంకురార్పణ చేశారు. జంట కవులమని వీరంగం తొక్కుతూ, తమను ఎదిరించే కవులే లేరని అహంభావంతో రెచ్చిపోయిన తిరుపతి వేంకటకవులు విద్వత్ గద్వాల సంస్థానానికి చేరి బుక్కపట్నం బాల సరస్వతి చేతిలో శృంగభంగం పొందిన ఉదంతం సాహిత్య లోకానికి సుపరిచితమే. తిరుపతి వేంకటకవుల నెదిరించగలిగిన విద్వాంసుల పుట్టినిల్లయిన గద్వాల ఘనచరిత్ర తెలుగు సాహిత్య చరిత్రలో సువర్ణాధ్యాయం వంటిది. ఆశు కవితా చక్రవర్తులు, అష్టభాషా నిష్ణాతులు, చిత్ర బంధశ్లేష కవితా పారంగతులను పోషించిన గద్వాల సాహిత్య ఘనకీర్తి మకుటాయమానమై విరాజిల్లినది. 'భైరవ తంత్రం' అనే తొలి సంస్కృత గ్రంథాన్ని రాసిన మంథాన భైరవుడు పాలమూరు వాసి అని లోకానికి చాటిన రామారావు అభినందనీయులు. సింహగిరి వచనాలు రాసిన కృష్ణమాచార్యులు పాలమూరు జిల్లావాసి అని తెలియజేయడం రామారావు పారదర్శక పరిశీలనకు సప్రమాణమైన ఉదాహరణ. అన్నం భట్టు అనే పండితులు తర్కశాస్త్ర గ్రంథాన్ని రచించారు. గోన బుద్ధారెడ్డి రంగనాథ రామాయణమనే ద్విపద కావ్యం రాశారు. ఇది తొలి తెలుగు రామాయణం. తొలి తెలుగు రచయిత్రి కుప్పాంబిక పాలమూరు వాసి అని తేల్చిచెప్పిన రామారావు నిశిత పరిశీలనా దృష్టికి నిలువెత్తు నీరాజనం. చిత్రభారతం రాసిన చెరిగొండ ధర్మన్న పాలమూరు వాస్తవ్యులని, ఉత్తర రామాయణం రచించిన కంకంటి పాపరాజు పాలమూరు వాస్తవ్యులని, అప్పకవీయమనే లక్షణ గ్రంథాన్ని రచించిన అప్పకవి పాలమూరు వాస్తవ్యులని రామారావు తేల్చిచెప్పారు. ఒకవైపు వర్సిటీ స్థాయిలో సాహిత్య విద్యార్థులకు పాఠాలను బోధిస్తూనే, పరిశోధన రంగానికి బాటలు వేశారు. పాలమూరు జిల్లా వ్యాప్తంగా సాహిత్య చైతన్య నిర్మాణం కోసం 'జ్యోతిర్మయి' అనే సాహిత్య సంస్థను స్థాపించి సభలు, సమావేశాలు నిర్వహించారు. కవి సమ్మేళనాలు, చర్చాగోష్ఠుల ద్వారా జిల్లా వ్యాప్తంగా సాహిత్య చైతన్య జ్యోతిలా వెలుగులీనుతూ నిరంతరం సృజనాత్మక భావాలను సాహిత్యవేత్తల గుండెలలో మేల్కొల్పుతూ వేగుచుక్కలా దిశానిర్దేశం చేసిన రామారావు సమకాలీన సాహిత్య మార్గనిర్దేశకులని చెప్పడంలో అతిశయోక్తి లేదు. జ్యోతిర్మయి సాహితీసంస్థ ద్వారా ప్రాచీన, అర్వాచీన సాహితీపరులు, కళాకారుల వివరాలను సేకరించడం, జిల్లాలోని పవిత్ర, చారిత్రక స్థలాల సమాచారం సేకరించి ప్రకటించడం ప్రధాన లక్ష్యాలుగా నిర్దేశించుకున్నారు. ప్రతిభావంతులైన ప్రతిష్ఠిత వ్యక్తులతో ప్రేరణాత్మకమైన ప్రసంగాలు ఇప్పించి యువ సాహితీవేత్తలను కవులుగా, కళాకారులుగా మలచడానికి ఎంతో కృషిచేశారు. వనపర్తిలో జ్యోతిర్మయి సంస్థ ప్రథమ వార్షికోత్సవంలో కవితా సంకలనం ఆవిష్కరింపజేశారు. 33 మంది కవుల కవితలను ప్రకటించారు. ఈ కవితా సంచికలో కేశవపంతుల రాసిన రావమ్మ భారతి, రమ్ము జ్యోతిర్మయీ స్వాగత గీతం ప్రచురింపబడింది. ఈ గ్రంథాన్ని నాటి ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రికి అంకితమిచ్చారు. ఈ కవితా సంకలనానికి డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి పీఠిక రాశారు. ద్వితీయ వార్షికోత్సవంలో కథా రచయితలను పరిచయం చేశారు. ఐదు కథల సంపుటిని ఆవిష్కరింపజేశారు. వల్లపురెడ్డి బుచ్చారెడ్డి-'పరాజితులు', కాచిరాజు శేషగిరిరావు-'మాయా మాలవగౌళ', పోల్కంపల్లి శాంతాదేవి-'సమర్పణ', ప్రభాకర్- 'సమానంతర రేఖలు', సి.నాగేశ్వరరావు- 'ఒకటి రెండుల మధ్య' కథల సంపుటాలు ప్రచురితమయ్యాయి. ద్వితీయ వార్షికోత్సవ సభలో సుప్రసిద్ధ కవులు గుంటూరు శేషేంద్రశర్మ, అరిపిరాల విశ్వం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తెలంగాణలో కవులే లేరని ఎగతాళి చేసిన కోస్తా విద్వాంసుల దురహంకారానికి అడ్డుకట్ట వేసి గోలకొండ చరిత పేరు మీదుగా సంకలనాలు వెలువరించి సవాలు విసిరిన తెలంగాణ తేజ విరాజితుడు, తెలంగాణ కవితా మర్మజ్ఞుడు సురవరం ప్రతాపరెడ్డిని, భాషాకోవిదుడు బూర్గుల రామకృష్ణారావును, కవి, సంస్కర్త, నిత్య చైతన్యశీలి గడియారం రామకృష్ణ శర్మను, పాలమూరు మట్టిలో పరిమళించిన తిరుమలరెడ్డి యశోదరెడ్డిని, దిగ్గంతుల వంటి ధీమంతులను కాకలు తీరిన కవి బ్రహ్మలనెందరినో అక్షరబద్ధం చేసిన సేద్యగాడు రామారావు. తెలుగుజాతి ఆయనకు రుణపడి ఉంటుంది. ఆయన సృష్టించిన సాహిత్యం నిత్య నూతనమై, సాహిత్య విద్యార్థులకు పరిశోధకులకు రాచమార్గమై, మార్గదర్శకమై నిలుస్తుందనడంలో సందేహం లేదు.